క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ శ్రీకాంత్, ఏఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కిష్టాయిపల్లి, గడ్డపోతారం, ఖాజీపల్లి, వావిలాల గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

రుణమాఫీని అమలు చేయండి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. రైతులకు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలోని లీడ్ బ్యాంకు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతులను ఇబ్బందులు పెట్టేవిధంగా బ్యాంక్ అధికారులు రుణాల పేరిట వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను తీసుకోకుండా అకౌంట్ నంబర్లను ఉపయోగంలో లేకుండా హోల్డ్‌లో పెట్టడం బాధాకరమన్నారు. అనంతరం బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, రాజయ్య, రమేష్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పట్టణ పరిధిలోని రుద్రారంలో ఉన్న ఎంఎస్ఎన్ పరిశ్రమ నిర్వాహకులు బుధవారం ఆచార్య డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ హెచ్ఆర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రౌండ్లు ఇంటర్వ్యూలు నిర్వహించి 14 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. డిగ్రీ ఫలితాలు వెలుబడిన తరువాత ఎంపికైన వారిని విధుల్లోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు నందుగౌడ్, నర్సింహులు, దీపిక పాల్గొన్నారు.


సాగు వివరాలను నమోదు చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్

కంది(సంగారెడ్డి): రైతులు సాగుచేస్తున్న రైతుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంటల సాగు సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుచేస్తున్న భూములు, బీడు భూములు, వెంచర్లుగా మారిన భూముల వివరాలను కూడా నమోదు చేయాలని వివరించారు. పంటల సర్వేలో అవసరమైతే వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు, సూచనలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పతాంజలి

సదాశివపేట(సంగారెడ్డి): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పతాంజలి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవం సందర్భంగా 12 విభాగాల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో బంగారు పతకాల ప్రదాత జగదీశ్వర్, కళాశాల అల్యూమినియం సంఘం ట్రెజరర్ మహేష్, ఎన్ఎస్ఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్యాసాగర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి
- సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీలు



జహీరాబాద్ టౌన్: మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

జహీరాబాద్ టౌన్: యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని ఎస్ఐ నరేష్ అన్నారు. మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవంగా సందర్భంగా మొగుడంపల్లి మండల కేంద్రంలో చిరాగ్‌పల్లి పోలీసులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలను అంధకారం చేసుకోవద్దని సూచించారు. అనంతరం గ్రామ సెంటర్‌లో మానవహారం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, ఎంఈఓ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

జోగిపేట(అందోల్): నిషేధిత పదార్థాలను విక్రయించేవారిపై చర్యలు తప్పవని సీఐ అనిల్‌కుమార్ అన్నారు. యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జోగిపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుట్కాలను నిషేధించినందునా క్రయ, విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం హనుమాన్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, ఎస్ఐ-2 మొగులయ్య, ఏఎస్ఐ గౌసొద్దిన్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు



హత్నూర: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో...

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ గాంధీ చౌక్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మునిపల్లి(అందోల్): మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే నష్టాలపై విద్యార్థులకు తహసీల్దార్ తెన్మొళి, బుదేరా ఎస్ఐ సురేష్, ఎంఈఓ దశరథ్ అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని హైస్కూల్, ప్రైమరీ పాఠశాలలో ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రమాణం చేయించి ర్యాలీ నిర్వహించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కంగ్టి(నారాయణఖేడ్): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కంగ్టి ఎస్ఐ విశ్వజన్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నారాయణఖేడ్: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌రెడ్డి

మాదకద్రవ్యాల వాడకం హానికరం

సదాశివపేట(సంగారెడ్డి): మాదకద్రవ్యాల వాడకం హానికరమని సీఐ మహేష్‌గౌడ్ అన్నారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు సురేందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నారాయణఖేడ్: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు దుర్భరంగా మారతాయని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన స్టిక్కర్లను ఆవిష్కరించి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బానిసై జీవితాలను కోల్పోవద్దన్నారు. అనంతరం డ్రగ్స్‌పై వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



మునిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు



కంగ్టి: విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు



సదాశివపేట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మహేష్‌గౌడ్

భూముల వద్దకు వెళ్లేందుకు దారి చూపండి

బూచనెల్లి గ్రామ రైతుల విన్నపం



వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

జహీరాబాద్: తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారి చూపాలని కోరుతూ మండల పరిధిలోని బూచనెల్లి గ్రామ రైతులు ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పురాతన దారిని కొందరు రైతులు దున్నుకుంటున్నారని, దీంతో మిగతా రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దారి ఇచ్చే విషయంలో పలువురు పక్కన ఉన్న పొలాల రైతులు నిరాకరిస్తున్నారని వాపోయారు. ఇటీవల దారి విషయమై ఫిర్యాదు చేస్తే పంచనామ నిర్వహించారన్నారు. అయినా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. దీంతో చేసేదేమీలేక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు శ్యాంరావు, సతీష్, శివ, శివానీ, శ్రావణి, అఖిల, మల్లారెడ్డి, మహేష్, నర్సారెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నోటుబుక్కులు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్ బుధవారం నోటుబుక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం మాయం

సంగారెడ్డి టౌన్: ఇంట్లో నిద్రపోతున్న సమయంలో మహిళ మెడలో నుంచి బంగారం దొంగిలించిన సంఘటన మండలంలోని తాళ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి భారతిబాయి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. పొద్దున్నే లేచి చూసేసరికి మెడలో ఉన్న మూడు తులాల బంగారం మాయమైనట్లు గుర్తించి వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అశోక్ తెలిపారు.



కాలుష్య జలాలను పరిశీలిస్తున్న జేఏసీ నాయకులు

కాలుష్య జలాల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడ ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్య జలాలను ఖాజీపల్లి గ్రామ కాలుష్య జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ దండె రమాకాంత్ మాట్లాడుతూ ఖాజీచెరువు, బంధం కుంట, ధర్మి చెరువు, గండిగూడెం చెరువులతో పాటు పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన సంపులు పూర్తిగా కాలుష్యంతో నిండిపోయాయని తెలిపారు. అయినా పీసీబీ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశ్రామికవాడలోని జిల్లెల వాగు వద్ద నిర్మించిన సంపులో కాలుష్య జలాలను నిల్వ ఉంచి ట్యాంకర్ల ద్వారా శుద్ధి కేంద్రాలకు తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు కుమార్, బీమా, సురేష్ పాల్గొన్నారు.

చిట్టి చేతులు.. గట్టి మేలు

- కిడ్డీ బ్యాంకు డబ్బులు వితరణ
- మానవత్వం చాటుకున్న చిన్నారి



నగదును అందజేస్తున్న చిన్నారి సాయిసవిర

నారాయణఖేడ్: డెలివరీ అయిన బాలింతకు ఓ చిన్నారి తన కిడ్డీ బ్యాంక్‌లో జమ చేసుకున్న రూ.4వేల నగదును అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళితే.. మనూరు మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇంట్లో చిన్న కిరాణాషాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 26వ తేదీన కిరాణ షాపులో ఫ్రిజ్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. అప్పట్లో మృతుడి భార్య శ్రీవాణి 6నెలల గర్భిణి. కాగా రెండు రోజుల క్రితం శ్రీవాణి ఖేడ్‌లోని ఓ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. అయితే ఆస్పత్రి, ఇతర ఖర్చులకు ఇబ్బందులు పడుతుండడంతో సమీప గ్రామం బెల్లాపూర్‌కు చెందిన సాయిసవిర తాను కిడ్డీ బ్యాంక్‌లో జమ చేసుకున్న నగదును అందజేస్తానని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీంతో సంతోషించిన తండ్రి శంకర్ తన కూతురు సవిరతో కిడ్డీ బ్యాంక్‌లో జమ చేసుకున్న రూ.4 వేల నగదును శ్రీవాణికి అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారులకు పంపించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి 1200 మందికి చెక్కులు మంజూరుకాగా ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో నిలిపివేశారని తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని మార్చి నేరుగా లబ్ధిదారులకు పంపిస్తామని చెప్పినప్పటికీ కొందరికీ మాత్రమే నేరుగా పంపించారని పేర్కొన్నారు. మిగతావి ఎమ్మెల్యేకు పంపించారని, తాము పంపిన దరఖాస్తులకు సంబంధించి మంజూరైన చెక్కులను నేరుగా లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ నజీబ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, మండల కోఆప్షన్ సభ్యులు నవాబ్, మున్సిపల్ కోఆప్షన్ లాయిక్, కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు విఠల్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ సుభాష్

హత్నూర(సంగారెడ్డి): మహిళా చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్ఐ సుభాష్ అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం, మహిళలు, బాలికలు సంబంధించిన చట్టాలు, హెల్ప్ లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీ-టీంకు, డయల్ 100కు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీహెచ్ ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి మాట్లాడుతూ బాలల హక్కులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్, ఏఎస్ఐ దుర్గయ్య, పీహెచ్ఎన్ వినోద, హెచ్ఇఓ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు



హత్నూర(సంగారెడ్డి): మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ నర్సింలు, ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, నాయకులు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలను ఎప్పటికప్పుడూ ఎండగట్టాలని, ఉద్యమాలు కొత్త కాదని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా కల్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హత్నూర మండల యువత అధ్యక్షుడు కిషోర్, దౌల్తాబాద్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్‌అలీ, నాయకులు రమేష్‌నాయక్, భాస్కర్‌గౌడ్, అర్జున్, సురేష్‌గౌడ్, సాజిద్, శేఖర్‌గౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎరువుల నిల్వలు పరిశీలన

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లోని ఎరువుల నిల్వలను మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ బుధవారం పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడు తూ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతివారం ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

◆ సీపీఐలో చేరిక

నారాయణఖేడ్: సీపీఎం కంగ్టి మండల శాఖ కార్యదర్శి మొయినొద్దిన్ బుధవారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా సీపీఐ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మొయినొద్దిన్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై పార్టీలో చేరినట్లు తెలిపారు.

◆ మల్లికార్జునస్వామి ఆలయంలో అన్నదానం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో వర్తక సంఘం ప్రతినిధులు బుధవారం అన్నదానం చేశారు. కాంగ్రెస్ యువజన నాయకులు ప్రవీణ్‌రెడ్డి, దేవాలయ అర్చకులు రవి, దేవాలయ కమిటీభ్యులు యాదిరెడ్డి, కృష్ణ, దిగంబర్, శివ పాల్గొన్నారు.

◆ కనీస వేతనాలు ఇవ్వాలి

నారాయణఖేడ్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖేడ్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వారికి ఒకే విధానంతో వేతనాలు ఇవ్వాలన్నారు. నాయకులు సతీష్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కుమార్, రాజు, రవి, ఏను, సాయిలు, శకుంతల, చంద్రకళ, సాయమ్మ పాల్గొన్నారు.

బహిష్కరణ

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సంఘం నాయకుడు మొయినొద్దీన్‌ను సీపీఎం నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి అతిమేల మానిక్ తెలిపారు. ఇక నుంచి మొయినొద్దీన్‌కు పార్టీతో ఎలాంటి సంబంధం ఉండదని పేర్కొన్నారు.

◆ జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: శేరిలింగంపల్లి నూతన జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్‌రెడ్డిని బుధవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

◆ ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



హత్నూర(సంగారెడ్డి): అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ, శంకర కంటి ఆసుపత్రి నానకరాంగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్యం స్పందన లభించిందని ఆ సంస్థ అధ్యక్షుడు శివశంకరరావు తెలిపారు. ఉచిత కంటి పరీక్షతో పాటు, షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించినట్లు, 387 మంది కంటి పరీక్షలు చేసుకోగా 45 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు శివశంకరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర కంటి ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ విజయ్, డాక్టర్ షాహద్, జస్లిన్, కార్తిక, నాయకులు రవి కుమార్, మాణిక్యరెడ్డి, శ్రీకాంత్‌రావు, పాష, మాజీ జెడ్పీటీసీ ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

జోగిపేట(అందోల్): చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు పరిధిలోని ఉమా సంగమేశ్వర దేవాలయంలోకి మంగళవారం ఓ వ్యక్తి చొరబడిన విషయం సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. సీసీ కెమెరాల ఆధారంగా అల్లాదుర్గం మండలం చిల్వరకు చెందిన అనిల్‌కుమార్‌గా గుర్తించారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

◆ హుక్కా కేంద్రంపై నిర్వాహకుడిపై కేసు

రాయికోడ్(అందోల్): హుక్కా కేంద్రం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా హుక్కా కేంద్రం నడుపుతున్నట్లు గుర్తించారు. నిందితుడు మోసిన్ అలీషాను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ వృద్ధుడు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కొల్లూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నివాసం ఉండే 56 ఏళ్ల వృద్ధుడు నరసింహులు ఈ నెల 9వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు గోపాల్ తండ్రి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ మోటారు బైక్ చోరీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాచన్నపేటలో మోటారు బైక్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాచన్నపేటలో నివాసం ఉంటున్న ఉదయ్‌కుమార్ తన మోటారు బైక్‌ను ఎప్పటిలాగే ఇంటి ముందు పార్క్ చేశాడు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి మోటారు బైక్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితుడు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో హైమాస్ట్ లైట్లను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ ప్రారంభించారు. మాజీ ఎంపీపీ సలీం, యువ నాయకుడు హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.